# విలక్షణ సాక్ష్యం



బస్సునుండి బయలుదేరేటప్పటికే సన్నటితుంపరపడుతూవుంది.

నేనూ మా కోడలు నిర్మల సరదాగా మాట్లాడుతూ యింటికి వస్తూవున్నాం. మాయింటి గేటుదగ్గరకు వచ్చింతరువాత మాట్లాడటం మానివేసింది. ఇంట్లోమాత్రం సరదాగా మాట్లాడటానికి జంకుతుంది. మాయింటి కొచ్చినప్పట్నుంచి అలా నేర్చుకుంది. తనూ తనభర్త మాకొంపవదలి యింకొక చోటికి పోయి సుఖపడితే బాగుంటుందన్నాను నిర్మలతో. తలమీద పడ్డ నాలుగు వర్షపు చినుకులను విదులుస్తూ, తనఅత్తగారు మావాణ్ణి విడిచి వుండలేనన్నదని నాతో చెప్పింది. మాకోడలికి నేనంటే అమితమైన గౌరవం, ప్రేమా. అందుకనే వాళ్ళ అత్తను అత్తమ్మా అని యెన్నడూ పిలవకపోయినా, నన్నుమాత్రం మామయ్యగారూ అంటూ గౌరవంగా పిలుస్తుంది. అలా నాకు చూపే ప్రత్యేక గౌరవానికి నేనుసంతోషించడం కొంతమందికి నచ్చకపోవచ్చు, కాని రెండైపోయిన మాలాటి కొంపల్లో నాకోడలు చూపే గౌరవం నాకు చాలా హాయినిస్తూ వుంటుంది. ఇంట్లో ఈరోజు రాద్ధాంతంయేమయివుంటుందా అనుకొంటూ వీధితలుపుతెరచి లోపలికి వెళ్లాం.

అదుగో! ఈరోజు మాఅమ్మాయి కల్యాణి ఏడుస్తూ ఎదురుగా వస్తూవుంది. దానిచేతుల్లో చినిగిపోయిన అట్టముక్కలున్నాయి. అదిదాచిపెట్టుకున్న నాఫోటో యెవరో చింపివేశారట. ఆఫోటోలో నేను నవ్వుతూవున్న చిన్న అబ్బాయిలాగున్నానట. ఆఫోటో యెవరు చింపివుంటారో నాకు తెలుసు. కాని యెంత యీర్ష్య ఐతేమాత్రం ఫోటో చింపడం దేనికి? రేపుకొత్తది తెచ్చిస్తానని దాన్ని ఓదార్చి తొందరగా మొఖం కడుక్కురమ్మన్నాను భోజనానికి. సాధారణంగా మాఆవిడ చేసే పనులను లెక్కపెట్టను. కాని చిన్నపిల్ల దాచుకున్న ఫోటో చింపివేయడం చాలా తెలివితక్కువపనిగా తోచి వంటింటిలోకి వెళ్ళాను, దండించడానికి.

ఆబొమ్మనెందుకు చింపావని మాఆవిడను అడిగాను. ఆ నాఫోటో చూస్తూవుంటే తనకు వొళ్లు మండిపోయిందట. నాసంగతి తనకు పెళ్ళికి ముందు తెలియకపోబట్టి తను యిప్పుడు నానా అవస్థలు పడుతూవుందట. నాకూతురు చిన్నప్పుడే నాగురించి నిజం తెలుసుకుంటే మంచిదని నామీదనున్న దాని అభిమానాన్ని పోగొట్టడానికి నిర్మల వంటింటిలోకి వచ్చింది. చదువుకున్నవాళ్లు వంటచేస్తే వళ్లు కందిపోతుంది గాబట్టి నిర్మల సాయం అవసరంలేదని వెక్కిరింపుగా అన్నది. అడ్డమైన చాకిరీ చేయడానికి తానున్నదట. ఇక లాభంలేదని నిర్మలా నేను వెళ్ళిపోతూవుంటే, 'మళ్ళీ యీరోజూ యిద్దరూ కలసేవచ్చారా?' అన్నది మాఆవిడ. వెనక్కితిరిగి

కోకా వెంకటేశ్వరరావు

కోపంగా చూచాను. మేమిద్దరం కలసిరావడములో తప్పేముంది? ఆస్కూల్ హెడ్మాస్టర్ నేను; మాకోడలు హిస్టరీ టీచరు. ఇద్దరం ఒకే బళ్ళో పని చేస్తూవుండి, యింటికి కలసిరాకుండా వేరేవేరే రోడ్లల్లో ఎందుకురావాలి? కోపం వద్దన్నట్లు నాకళ్లల్లోకి చూచింది నిర్మల. అవును. అది మంచిపనికాదు. అందువల్ల మా ఆవిడ అనుమానం పెద్దరోగంగా మారుతుంది!

ఆరాత్రి భోజనాలు చేస్తూవుంటే, రేపు వాళ్ళ క్లాసు పిల్లలందర్నీ కమలం టీచరు సినీమాకు తీసుకువెళ్తానన్నారని చెప్పింది కళ్యాణి. ఆ కమలంతో వెళ్ళడానికి వీల్లేదన్నది మా ఆవిడ. క్లాసు వాళ్ళంతా వెళుతుంటే కళ్యాణిని మాత్రం వద్దనడంలో న్యాయం లేదన్నాను. కమలం లాంటి వాళ్ళతో పంపిస్తే పిల్లలు బాగుపడరట. అటువంటి వాళ్ళని స్కూల్లో టీచర్లుగా వుంచడం బుద్ధితక్కువన్నది మా ఆవిడ. మనబంగారం మంచిదైతే ఆవిడేం చేస్తుందన్నాను. ఎలాగైనా ‘కళ్యాణిని సినిమాకు పంపాలనే వుద్దేశ్యంతో. ‘అమ్మ పంపడానికి వీల్లేదన్న తరువాత యింత రభసదేనికి?’ అన్నాడు మా పెద్దవాడు. మా వాడికి మంచిచెడ్డల విచక్షణ తెలియదు. వాడి నవ్వు ఎంత గంభీరమో, వాళ్ళ అమ్మలో వాడికున్న విశ్వాసం అంతగట్టి.

ఈ వెధవ గోలలో తిండి సహించక, నా మేడ మీది గదిలోకి వెడుతూ, కమలాన్ని ప్రేమించడం అనే మహాఘోరపాపానికి పరిహారార్థంగా యీ పన్నెండు సంవత్సరాలు ఆనందమనేది లేకుండా జీవితం వృథాగా గడపడం చాలదా, అని నా అంతరాత్మను ప్రశ్నించుకున్నాను—

* * *

పన్నెండు సంవత్సరాల క్రితం——

ఘుట్టిగా పడాలి అనుకోకుండానే నేను పడ్డాను కమల ప్రేమలో. నాజీవితంలో యింత వరకు ఒంటరిగావున్నానని, కమలం మాస్కూల్లో టీచరుగా వచ్చిన రోజు తెలుసుకున్నాను. అన్నాళ్లూ నాసంసారం, యిల్లు, నాఉద్యోగం చూచుకొని తృప్తి పడేవాణ్ణి, కాని ఆ రోజునుండి నా జీవితంలో పెద్దలోపం వుందనీ, ఏదో మిస్ (Miss) అవుతున్నాననీ ఫీల్ అయ్యేవాణ్ణి. కమలంతో మాట్లాడినప్పట్నుంచి చాలా తృప్తికరంగా వుండేదినాకు. తీక్షణంగా వున్న తిలకంలాగ, స్నేహభావం అందంగావున్న ఆవిడ ముఖంలో కనబడుతూ వుంటుంది.

అప్పటిరోజుల్లో మా ఆవిడ నాజూకుగానే వున్నా తీరుమాత్రం యెప్పుడూ లేదులెండి! మా పెళ్ళయిన క్రొత్తలో పాత తగాదాలేవో వున్నా తరువాత అటువంటివేమీ మాయింట్లో లేవు. కాని ఒకటి — మాఆవిడకు విపరీతమైన యీర్ష్య. పరాయి ఆడవాళ్ళతో నేను స్నేహభావం చూపడంగాని, వాళ్ళని నేను పొగడడం గాని మా ఆవిడ ఏమాత్రం ఓర్వలేదు.

మాస్కూలుకు పాతికేళ్ళు నిండుతాయి; ఆ సంవత్సరం రజతోత్సవం అతివైభవంగా జరపడానికి రాత్రింబవళ్ళు సన్నాహాలు కూడా విడిగా జరుగుతూ వున్నాయి. కమలం యీ సన్నాహాలలో చాలాశ్రద్ధగా పనిచేస్తూవుండేది. ఒకే వుత్సాహంతో తలపెట్టిన కార్యాన్ని చేస్తూవుండడంవల్ల మేమిద్దరం కలసి మెలసి కొద్దిరోజులు గడిపాము. నన్ను నేను తెలుసుకునే లోపలే, కమలం కలలలోకూడా రావడం మొదలు పెట్టింది. అదేం అంత తప్పుగా తోచలేదు నాకు. కమల పరిచయం నా జీవితాన్ని ఆనందమయంగా మార్చిందని నానమ్మకం—నమ్మకమేకాదు అది నిజం కూడా! స్కూల్లో డ్రామాలు వేసినా, మీటింగులు జరిగినా మా ఆవిడ పట్టించుకునేదికాదు. అవంటే ఎక్కువ ఆసక్తికూడా లేదు. ఇదివరకు బలవంతం చేసి ఒకటి రెండు మీటింగులకు తీసుకువెళ్ళాను. కాని కమలం వచ్చింతరువాత మా ఆవిడను తప్పకుండా తీసుకు వెళ్ళవలసిన అవసరం కూడా వుండేదికాదు.

ఆరోజు రాత్రి చాలా ఆలస్యంగా యింటికి వచ్చాను. మా ఆవిడ నాకోసం నిద్రమేలుకు కూర్చుంది. భోజనంచేస్తూవుంటే, ఆ కమలంతో కూడా ఎక్కడికి వెళ్ళారని ప్రశ్నించింది. మా ఆవిడ వెఱ్ఱి ముఖంలోకి చూస్తూ సంగతేమని అడిగాను. స్కూల్లో అంత సంబరం జరుగుతూ వుంటే తననికూడా రమ్మంటే రాకపోవడం చాలక, యీ నిందారోపణకూడానా అన్నాను. నా మాటలు సరిగా వినిపించుకోకుండా, నా బుద్ధి గడ్డి తినకుండా ప్రతినిత్యం కాపలా

కూర్చోవాలని తను అనుకోలేదన్నది. లేకుంటే తాను తప్పకుండా వచ్చేదట వుత్సవానికి. ఎదురింటి వెంకాయమ్మగారు, వుత్సవంలో కమలం నావెంట తిరగడం చూచానని మా ఆవిడతో చాడీలు చెప్పింది. అంతేకాకుండా మీటింగు అయిపోయి రెండుగంటలైనా ఇంత ఆలస్యంగా కొంపకి రావడానికి కారణం యేమిటన్నది.

మాట్లాడకుండా చెయ్యి కడుక్కొని, నా గదిలోకి వెళ్ళి, కమలంతో మాట్లాడుతూ వుంటే టైముకూడా తెలియకుండా వుందే అని ఆలోచిస్తూ నిద్రపోయాను. కమలం నాతో చాలా స్నేహంగా వుండాలని ప్రయత్నిస్తూ వుందనీ, నిజానికి నాకు కమలం అంటే ఏమాత్రం యిష్టం లేదనీ చెప్పాను, మా ఆ వి డ తో మరుసటి ఉదయం. 'ఎన్ని అబద్ధాలు చెప్పినా యిక లాభం లేదు, యీ వ్యవహారం యింక ఎలా సాగుతుందో చూస్తాగా' అన్నది మా ఆవిడ! నేనొక స్త్రీతో—అదీ, ఒ కే చో ట నాతో కలసి ఉద్యోగం చేస్తూవున్న స్త్రీతో—స్నేహంగా ఉన్నంతమాత్రాన మా ఆవిడ కెందుకో యింత యీర్ష్య.

*   *   *

ప్రతిసంవత్సరం ఏప్రియల్ ఆఖరివారంలో మా స్కూల్ పిక్నిక్ జరుగుతుంది. ఆ సంవత్సరం పిక్నిక్ పార్టీ యిక్కడికి ఐదుమైళ్ళ దూరంలో వున్న తోటలకు వెళ్ళాలని నిర్ణయానికి వచ్చాం. మా ఆవిడకు యెన్నడూ కలగని కోరికకలిగి తనుకూడా పిక్నిక్‌కి వస్తానన్నది. వస్తానన్నదాన్ని వద్దంటే అసలు అనుమానం తగులుతుందని, తప్పకుండా రమ్మన్నాను.

చక్కని తోటలో పిల్లలందరూ సరదాగా ఆడుకొంటూ వున్నారు, వాళ్లలో పెద్ద కుర్రవాళ్లు వంటలు చేస్తున్నారు. టీచర్లంతా భోజనసన్నాహాలు చేస్తూవున్నారు. మావాడు వాళ్ళ అమ్మ దగ్గరే కూర్చొనివుండటం చూచి, వెళ్ళి వాళ్ళ క్లాసు పిల్లలతో ఆడుకోమన్నాను. వాళ్ళ అమ్మ వాణ్ణి తనతోనే వుండమని ఆజ్ఞాపించిందట. మంచిదన్నాను. అందరికీ వడ్డించారు. నేను పిలువకముందే, మా ఆవిడ మా వాడు అందరితో భోజనానికి కూర్చున్నారు. పిల్లలందరూ ఆట పాటలు ఆపి భోజనాలకి కూర్చున్నారు.

శ్రమతీర్చుకోడానికి నేను కొబ్బరితోపు దాటి కాలువవైపు వెళ్లాను. మీరు నేచెబితే నమ్మరు. నే వెళ్ళాలని వెళ్ళలేదు—నీళ్ళకు దగ్గరగా ఒక రాతి బండమీద కమలం కూర్చునివుంది, ఎడమకాలు రుద్దుకుంటూ. కొన్ని నిమిషాలకాలం నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డాను—మనం ఎవరినైతే తప్పించుకు తిరగాలని ప్రయత్నిస్తామో వాళ్లే మనకు ప్రతి సందులోనూ ఎదురు పడతారు. కమలంతో యిదివరకులాగ కులాసాగ కాలక్షేపం చేయగూడదనే నిర్ణయానికి పోయినవారం వచ్చాను. కాని, కమలానికి నేను యెంతదూరంగా వుండాలని ప్రయత్నిస్తున్నానో, రోజురోజుకీ నా హృదయానికి కమలాన్ని అంత దగ్గరకు లాక్కుంటూ వున్నాను.

ఆ రాతిబండమీద కూర్చున్నది కమలమేనా, లేక ఏ నదీదేవతో అమాంతంగా ఆ ప్రవాహంలోంచి బయటపడి నాకోసం నిరీక్షిస్తూవుందా- అనే సందేహం మొదట నాకు కలిగింది. కాని నదీదేవతలు రెండుజడలు వేసుకోరు గదా అని, కమలమేననే నిర్ణయానికి వచ్చాను. జీవితంలో నేవాంఛించిన శాంతి, స్నేహం, ప్రేమా ఒక్కసారి చూడకలిగాను కమలంలో. కాలు బెణికిందట. బెణికిన కాలు పట్టుకు చూచాను. చాలా మృదువుగానూ, సున్నితంగానూ ఉంది. బెణికే వుండవచ్చు! జడలకి అందకుండా గాలిలో తేలుతూవున్న ముంగురులు ముఖంమీద పడుతున్నాయి. నా ముఖంలోకి చిరునవ్వుతో చూచింది. నాగుండె అతివేగంగా కొట్టుకొంటూవుంది. కమలంగుండె కూడా అంతే.

పులి అరుపనుకున్నాను. కాదు—అది మా వాడి అరుపు. వాళ్ళ అమ్మా, వాడు మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చారు. వాళ్ల ముఖంలో అత్యంతకోపం కనబడుతూవుంది. ఇటువంటి వెధవపనులు నేను చేస్తానని మావాడు యెన్నడూ అనుకోలేదన్నాడు. సిగ్గుతో నా తల వూడి క్రింద పడుతుందనుకున్నాడట. అవును. చాలా సిగ్గుపడ్డాను — నాకోసంకాదు, కమలకోసం. కమలాన్ని ప్రేమిస్తున్నానన్నాను. మా ఆవిడ వొప్పుకుంటే పెళ్ళి కూడా చేసుకుంటానన్నాను. మా ఆవిడకు స్పృహతప్పింది. ఈవిధంగా బాధిం

చడంకంటే ఖూనీచేయడం మంచిదన్నాడు మా వాడు. నేనే మాఆవిడను కారుదగ్గరకు మోసుకు వెళ్ళాను.

ఇంటికి వెళ్ళేసరికి స్పృహవచ్చింది. నాతో యేదో మాట్లాడాలని, మావాణ్ణి గదిలోంచి వెళ్ళ మంది. మాఆవిడ కళ్ళల్లో సాధారణంగా వుండ వలసిన కోపానికి బదులు అశ్రువు లున్నాయి. 'కమలాన్ని నిజంగా ప్రేమిస్తున్నారా?' అని అడి గింది. 'ఈనాటివరకూ లేద'న్నాను. 'కాని ఇంట్లో నాకు స్థానంలేనందునా, నా అవసరం యింట్లో వాళ్ళకి లేనందునా, ఇక ముందుసంగతి చెప్పలే' నన్నాను. ఏడుస్తూ అలాకాదన్నది. తాను ప్రతినిత్యం నన్ను ప్రేమిస్తూవున్నా నన్నది. మా ఆవిడ నామీద తనకున్న ప్రేమనుగురించి మాట్లా డటం నాకు ఆశ్చర్యంవేసింది. ఆవకాయపచ్చడి బూజుపట్టిందనో, నీరసానికి టానిక్కు తెమ్మనో వేధించవలసిన నా సతీమణి యీరోజు యిలా మాట్లాడటం తమాషాగానే వుందనుకున్నాను. తను నన్ను ప్రేమిస్తూవుందని తెలుసుకొన్నం దుకు ధన్యుణ్ణిని మాఆవిడకి తెలియబరచి నా గదిలోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను. పాపం, బెణికిన కాలుతో కమలం యిల్లు యెలా చేరు కుందో !

మా ఆవిడకో జబ్బు వుంది. ఇంట్లో వున్న వాళ్ళంతా తన సొత్తు. మావాడు దాని కొడుకే! వాడు నన్ను ప్రేమించకూడదు. నేను మాఆవిడ భర్తనే అచ్చంగా. మరో ఆడదాన్ని కన్నెత్తి చూడగూడదు. విడాకుల వరకు వచ్చిన మేం, అమాంతంగా ఒక్కటైపోయాం! పిక్‌నిక్‌లో జరిగిన సంఘటన మాఆవిడ జబ్బుకి మంచి మందులా పని చేసింది. వేసవిసెలవలకు కమలం వాళ్ళవూరు వెళ్ళిపోయింది. ఈ మూడు నెల్లూ కమలం యిక్కడ వుండకపోవడం ఒక విధంగా మా సంబంధం తెగిపోవడానికి సాయపడుతుందని సంతోషించాను.

ప్రతి సంవత్సరం బడి పెట్టడం, మూయడం జరుగుతూనేవుంది. ఆనాటి పిక్‌నిక్ పార్టీ, మా కాలవవొడ్డుని ప్రణయం జరిగిపోయి యిప్పటికి పన్నెండు సంవత్సరాలు—అంటే ఓ పుష్కర మన్నమాట !— గడచిపోయాయి. మళ్ళీ ఆ గొడవ త్రవ్వకువచ్చి కళ్యాణిని, కనులంతో సినీమాకు పంపకపోవడం దేనికి ?

* * *

ఇంటిగుమ్మంవరకు వెళ్ళాను. తిరిగి వచ్చేద్దా మనుకున్నాను. కాని మనసొప్పలేదు. తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాను. అంతా నిశ్శబ్దం. దుస్తు లన్నీ తడిసిపోయాయి. వర్షం వస్తుందేమోనని సందేహించి బయటకు వెళ్ళడం తెలివితక్కువే. నిర్మలమాత్రం నిద్రమేలుకు కూర్చుంది. దుస్తులు మార్చుకున్నాను. చాల చలిగా వుండడమే కాకుండా, వర్షంలో తడిసిపోయానని వేడివేడి కాఫీచేసి యిస్తానన్నది నిర్మల. వంటింటిలోకి వెళ్ళాం. అమ్మాయి కాఫీ తయారు చేస్తూ వుంది.

మా ఆవిడ తయారు! ఈఅర్ధరాత్రి కాఫీలూ, సరససల్లాపాలు మావాడికి తెలియదు గాబట్టి సరిపోయిందన్నది. వర్షంలో తడిసిపోయినందున వేడికాఫీ చేసియిస్తున్నానని నిర్మల చెప్పింది కోపంగా. బుద్ధిలేనిమాటలు కట్టిపెట్టమని మాఆవిడను గద్దించాను. రోజూ పాలు పిల్లి త్రాగిపోతుందనుకొన్నదట. పాలగిన్నె బీరు వాలో పెట్టబోతూవుంటే దొర్లి క్రిందపడ్డది. ఈ గోలకు మావాడు లేచివచ్చాడు వంటింటి లోకి, వేడివేడి ఫలహారాలేమైనా తయారవు తున్నాయేమోనని. అర్ధరాత్రివరకు మేల్కొంటే ఆరోగ్యం చెడిపోతుంది గాబట్టి వెళ్ళి పడుకో మన్నాడు నిర్మలను. నారూముకు నేను వెళ్ళి పోయాను.

ఆరాత్రి నాకు నిద్రరాలేదు. మావాడికికూడా లేనిపోని అనుమానాన్ని కలిగిస్తుంది త్వరలోనే అసలు కమలంవైపు నాహృదయం వెళ్ళడానికి కారణం మాఆవిడే. నేనంటే ఎప్పుడూవిసుగుదల అసహ్యం చూపించేది. మనమంటే అసహ్యించుకునేవాళ్ళని మనమేలా ప్రేమిస్తాం ఇతరులమీద ఆవిడకున్న యీర్ష్యే నన్ను అలా మార్చింది. నన్ను నిర్మల తండ్రిగా భావిస్తూ వుంది. అటువంటప్పుడు మాఆవిడ అభూత కల్పనలెట్లా భరించగలను? ఒకసారి అనుమానం కలిగిన తరువాత హృదయాలు అతుక్కోవు వాడికి వాళ్ళ అమ్మచేష్టలు అన్నీ తేటతెల్ల మయ్యేటట్లుచేస్తే మంచిదనుకున్నాను.

కాని నామాటలు వింటాడా? నన్ను నమ్మ్తాడా? తన భార్య అంటే వాడికి చాలా ప్రేమ. వాడు కాలేజీలో చదువుతున్నప్పుడు నిర్మలను ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. వాళ్ళఅమ్మ అందుకు వీల్లేదన్నది. అసలువాడు వాళ్లఅమ్మ దగ్గరవుంటే యీవివాహం జరిగే వుండేదికాదు. అలా వాడు వివాహం చేసుకుంటే తను బావిలోదూకుతానన్నది. మావాడు తలపెట్టింది నాకు అభిమతమేనని తెలియజేశాను. మావాడు రిజిష్టర్డ్ మేరేజి చేసుకొని నిర్మలతో సహాదిగాడు. ఇప్పటికి ఆరునెలలైనా వాళ్ళఅమ్మ బావిలోదూకలేదు! ఈకారణాల వల్లనైనా నామాటలు తప్పకుండా నమ్మ్తాడని అనుకొన్నాను.

మరుసటిరోజు సాయంకాలం స్కూల్ నుండి త్వరగా వాడిఆఫీసుకువెళ్ళి షికారు వెళదాం రమ్మన్నాను. ఇంకొక ఆరు నెలల పాటు యీకొంపలో నిర్మలా వాడువుంటే వ్యాళఅమ్మ వాళ్ళలో తగాదాలు పెడుతుందని చెప్పాను. వాళ్లఅమ్మకి కోడలంటే అసహ్యంఅనిచెప్పాను. వాడు తనతల్లినితప్ప యింకెవ్వరిని ప్రేమించినా వాళ్లఅమ్మ చూడలేదని చెప్పాను. వాడు నన్ను ప్రేమించకుండా వుండడానికి వాళ్ళఅమ్మే కారణమని చెప్పాను. తనభార్యవిషయంలోకూడ అలాచేస్తుందన్నాను. వాడి బుర్రలోకి నామాటలు యెక్కలేదు. వాళ్ళఅమ్మ, వాడు కలసివుండటం నేను చూడలేక, కల్లిబొల్లి మాటలు చెబుతున్నానని నన్ను నిందించాడు. నామాటలు లెక్కచేయకుండా యింటికి వెళ్ళిపోయాడు.

* * *

నాకు బ్రహ్మాండమైన సన్మానం జరుపబోతున్నారని స్కూల్లో ఆరోజు సాయంకాలం చెప్పారు. నా యిరవై సంవత్సరాల సర్వీసులో నాచేతుల్లో నలిగి పైకొచ్చిన విద్యార్థులందరూ నాకీ సన్మానాన్ని తలపెట్టారనీ, సన్మానానికి మాయింట్లో అందర్నీ తప్పకుండా తీసుకురావాలనీ చెప్పారు. అప్పుడు నాకు నవ్వొచ్చింది! నాక్రింద వందలకొద్దీ కుర్రాళ్లు చదువుకొని పెద్దవాళ్లయ్యారు. వాళ్ళంతా నన్ను ప్రేమిస్తున్నారు- యెల్లుండి గౌరవించబోతున్నారు. నా కొడుక్కి— నా సొంతకొడుక్కి నేనంటే పరమ అసహ్యం !

రాత్రి భోజనాలదగ్గిర కళ్యాణి రేపటి సన్మానాన్ని గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. తను నాప్రక్క కుర్చీలో కూర్చోవచ్చా అని అడిగింది. ఎందుకైనా మంచిదని, నాప్రక్కకుర్చీ వాళ్ళ అమ్మకి రిజర్వుచేసి వుంచుతారన్నాను.


* * *

మా ఆవిడ తన ప్రోగ్రామ్ మార్చుకుంది. సన్మానానికి వస్తానని ముస్తాబయింది. చాలా మటుకు, స్కూల్ టీచర్ల తరఫున కమలం నా గురించి మాట్లాడుతుందని తనుకూడా విన్నది కాబోలు! ఊళ్ళో వాళ్లంతాకూడా మా యిద్దరి పేర్లూ కలిపితే తాను భరించగలదా?

నాకు భయంగానే వుంది. నా ట్వీడుసూటు వేసుకొంటూ వున్నాను. కోటు వేసుకునేసరికి వీపుమీద పెద్దరంధ్రం వుంది. ఎవరో కత్తిరించేశారు. ఎవరు కత్తిరించింది నాకు తెలుసు. కాని యిప్పుడు గొడవ చెయ్యడం నా కిష్టంలేదు. వేరే మామూలు సూటు వేసుకొన్నాను. అంతా వెళ్ళాం.

నా కుడివైపు మా ఆవిడా, తరువాత వరుసగా మావాడూ కళ్యాణీ కూర్చున్నారు. ఇటువైపు బ్రహ్మంగారూ, మిగిలిన పెద్దలూ కూర్చున్నారు. టీ త్రాగింతరువాత కప్పులూ సాసర్లూ తీసివేశారు. ఇక వుపన్యాసాలు ప్రారంభించారు. స్కూల్ను స్థాపించిన బ్రహ్మంగారు, స్కూలుకు పేరుప్రతిష్టల రావడానికి కారణం నేనే నన్నారు. ఇరవైఏళ్ళక్రితం నాదగ్గర చదువుకున్న సూరిశాస్త్రి, నేను మహర్షి వంటివాడి నన్నాడు. ఇంకా చాలాచాలా చెప్పారు. స్కూల్ టీచర్ల తరఫున కమలం మాట్లాడింది. నాకు అధికారగర్వం లేదనీ, చాలా స్నేహపాత్రుణ్ణి అనీ, నా హృదయం అతి సున్నితమైనదనీ మాట్లాడింది. నాయందు వాళ్లుచూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతాభివందనా లర్పించాను నేను.

ఆ సంవత్సరం ఆటలలో గెల్చిన పిల్లలకి బహుమతులుకూడా ఆ రోజే యివ్వాలనుకొని సబ్ కలక్టర్‌గారి భార్యను ఆహ్వానించారు.



కాని ఆమె అస్వస్థతగా వుండి రాలేదు. అందువల్లబహుమతులు మాఆవిడనే యివ్వమనికోరారు బ్రహ్మంగారు. మాఆవిడ అందుకు అంగీకరించి బహుమతులు అందరికి ప్రసాదించింది. 'నాలుగు ముక్కలు మాట్లాడండీ' అన్నది కమలం మా ఆవిడను. ఏదో గౌరవానికి అడిగింది గదా అనుకునేంత లోపలే, మాఆవిడ వుపన్యాసం మొదలు పెట్టింది.

'మీరు మీ హెడ్మాస్టర్ గారినిగురించి చాలా చెప్పారు. మహర్షి వంటి వారనికూడా అన్నారు. ఆయన ఎటువంటివారో నేను మీకు నిజం చెబుతాను. వారు మేనకా సమ్మోహితులైన విశ్వామిత్రునివంటి దొంగ ఋషులు. ఇదుగో యీ కమలం, హెడ్మాస్టర్ గారూ సాగిస్తున్నదినాకు తెలుసు, మా వాడికి తెలుసు'—

ఇదంతా ఆకుర్చీలో కూర్చుని కలగంటున్నానని అనుకున్నాను. కాని మావాడు లేచి వాళ్ళ అమ్మ నోరు మూసి కూర్చోబెడుతున్నాడు. సన్మానానికి వచ్చినప్రజాసమూహంలో అలజడి, కల్లోలం, కోలాహలం కలగడం చూసి యిది కల కాదనుకున్నాను. మా ఆవిడ నోరుమూసినా వూరుకోకుండా 'నీకు తెలియదురా! నీపెళ్ళాన్ని కూడా కమలంలాగ తయారు చేస్తున్నాడురా!' అంటూ వుంది మా ఆవిడ. మావాడు లేచి 'అయ్యా! క్షమించండి! మాఅమ్మకు యీ విధంగా హిస్టీరియా వస్తూవుంటుంది. అందువల్ల ఆమె యిప్పుడన్నమాటలు లెక్క చెయ్యకండి' అన్నాడు. మా ఆవిదను బయటికిలాక్కొని వెళ్ళాడు. నాకు కోపం గానీ, విచారంగానీ కలుగలేదు—మతిచెడిపోడంవల్ల. కమలాన్ని క్షమించమన్నాను - 'ఫరవాలేదు, ఎవ్వరూ నమ్మరులెండి!' అన్నది కమలం. నాకు పూర్తిగా సన్మానం అయింది.

నిర్మలా కళ్యాణీ నేనూ యింటికి వెళ్ళేసరికి మావాడు రెండు సూట్కేసులు పుచ్చుకొని మేడమెట్లు దిగుతున్నాడు. వాళ్ళఅమ్మ పెరటిలో కుర్చీ వేసుకొని కూర్చునివుంది. ఇదేమిటని మావాడి నడిగాను. నిర్మలతోకూడా యీయింటి నుండి వెళ్ళిపోతానన్నాడు. ఈరోజుకి హొటల్లో వుండి, రేపు వేరే యిల్లు చూచుకొంటానన్నాడు. ఎందుకన్నాను. ఇన్నిరోజులూ వాళ్ళఅమ్మతో కలసి నన్ను వేధించుకు తిన్నందుకు క్షమించమన్నాడు. ఈనాటికి గాని వాళ్ళఅమ్మ యీర్ష్య తను తెలుసుకో లేకపోయానన్నాడు. నాట్యేడుకోటు రంధ్రం కూడా చూచానన్నాడు. వాడితోకూడ నన్నూ వచ్చేయమన్నాడు. వాళ్ళఅమ్మను వంటరిగాజేసి అందరూ వెళ్ళితే యెలాగని అడిగాను వాణ్ణి. ప్రయాణం ఆపివేసి మేడమీదికి వెళ్లాడు.

పెరటిలోకి వెళ్లాను. వెక్కి వెక్కి యేడుస్తూ వుంది మాఆవిడ, కొడుకు వెళ్ళిపోతాడని. వాడిని ఆపుచేసేభారం నాదని ఓదార్చాను. తన ప్రవర్తన మార్చుకుంటానన్నది. చూడాలి మరి!